## సరదాకథలు

# ముఖ్మల్ చెప్పు

రాజా

రైలు వేగాన్నందుకున్న తర్వాత బెర్తు మీదకు చేరిందే కాని తన కిప్పట్లో నిద్రరాదని ఖచ్చితంగా తెలుసు— నటి నీలవేణికి

మరికొన్ని గంటల్లో తను హైదరాబాద్ లోఉంటుంది. ఆ తర్వాత కొన్ని నిముషాల వ్యవధిలోనే రఘురావ్ ముందు ఉండాలి.

రఘురావ్— ఇవాళ ఫిలిం పరిశ్రమలో ఎంతో ఉన్నతస్థాయిలో ఉన్న రచయిత, దర్శకుడు — పదేళ్ళక్రితం ఛాన్సుల కోసం డ్రామా సర్కిల్ లో తిరిగే ఓ ఛోటా రచయిత.

అందరూ అతన్ని పొగిడేవారుగాని తనకు మాత్రం అతడి మీద ఏ మాత్రమూ నమ్మకంలేదు. వాలా సార్లు అతను రాసిన డైలాగుల్ని కొట్టేసేది. "అది కూడా ఉంటే ఎక్స్ప్రెషన్ ఇంకా బాగా పండేదండీ'' అనేవాడు.

"చూడవోయ్ రఘురావ్! నువ్విప్పుడే అడుగు పెడుతున్న వాడవి. నటిగా నా అనుభవంలో నీలాంటి రైటర్లని ఎంతమందిని చూసి ఉంటానంటావ్...!?'' అనేదితను.


ఇలాగ వాలాసార్లు జరిగేది. ఓసారి ... తనకు... బాగా గుర్తు... ఓ డైలాగు మార్చి చెప్పింది.

"రచయితగా నేననుకుంటున్న ఎక్స్ప్రెషన్ వేరండీ'' అన్నాడు రఘురావ్.

"మీ రచయితలు ఒకటే ఎక్స్ప్రెషన్ లో రాస్తారోయ్! నటిగా ప్రతి డైలాగ్ కి రకరకాల ఎక్స్ప్రెషన్ లు ఇవ్వగల అనుభవం నాది. పిల్లకాకికేం తెలుసు ఉండీలు దెబ్బ అని ఇలా ప్రతీ సారీ సుత్తికొట్టకు'' అంది తను.

"అది కాదండీ... ఒక్కసారి ఇలా కూడా అని చూడండీ'' అన్నాడతను.

"అనవయ్యా... అయినా నువ్వు రచయితవా... లేక దర్శకుడివా?''




"ప్రతి రచయితలోనూ ఓ దర్శకుడు కూడా ఉంటాడండీ''.

"అయితే పెద్ద దర్శకుడవైన తర్వాత మాట్లాడు. అంతవరకూ తగుదునమ్మా అంటూ ప్రతిదాంట్లోనూ వేలు పెట్టకు నాలుగు అక్షరంముక్కలు వచ్చిన ప్రతివాడు రైటరే ఈ రోజుల్లో రైటరన్న ప్రతివారూ డైరెక్టర్నని అనేసుకొంటూ ఉంటే ఇక గాడిదకీ గుర్రానికీ తేడా ఏముంటుంది'' అంది తను.

"మేడమ్! మీరు వాలా ఘోరంగా మాట్లాడుతున్నారు. ఏదో రోజు మీరు ఫీలయి తీరారు. ఇంత నీచంగా మాట్లాడినందుకు'' అన్నాడు రఘురావ్.

అంతే! ఆ రోజు నుంచీ రిహార్సల్స్ కి హాజరవడం మానేశాడు. ఆ తర్వాత ఊళ్ళోంచి మకాం ఎత్తేశాడన్నారు. మరికొన్నాళ్ళ తర్వాత ఫిలిం సర్కిల్ లో తిరుగుతున్నాడన్నారు. ఇంకొన్నాళ్ళకి రచయితగా కొన్ని సినిమాలకి అతని పేరు కనిపించసాగింది. క్రమక్రమంగా దర్శకుడై సినిమాలు కూడా తీశాడతను.

వైరిజనం... సక్సెస్ ఎటు ఉంటే అటు పరుగెడుతారు గాని అసలు రఘురావ్ ఎందుకలా పైకొచ్చేశాడో ఇప్పటికీ తనకు అంతుపట్టని విషయం.

ఓసారి... ఓ పరిషత్తులో... ప్రైజ్ డిస్ట్రిబ్యూషన్ కి రఘురావ్ ని పిలిచారు. అప్పుడు పరిచయం చేశారు నిర్వాహకులు.

"ఆవిడ బాగా తెలుసండీ నాకు'' అన్నాడతను.

"మరిమీ సినిమాలలో ఓ ఛాన్సు ఇవ్వవచ్చు కదండీ'' అన్నాడు సభకు అధ్యక్షత వహించిన మంత్రిగారు.

"ఆవిడ చేస్తానంటే దానికేం భాగ్యం'' అన్నాడు.

"ఇకనేం... మీరు కూడా ఊ అనండీ... మొత్తం క్రెడిట్ నేను కొట్టేస్తాను'' అని ఒత్తిడి చేశాడా మంత్రిగారు.

"తప్పకుండా'' అంది తను మొహమాటానికి.

వారం తిరక్కుండా టెలిగ్రాం వచ్చింది రఘురావ్ దగ్గర్నుంచి ఓ పౌరాణిక సినిమాలో హీరోయిన్ రోల్ కి రమ్మనమని.

"మరేం ఫర్వాలేదు

నీలవేణిగారూ! అతగాడెప్పుడో మర్చిపోయి ఉంటాడు మీ మధ్య జరిగిన గొడవ గురించి. లేకపోతే ఇలా ఆహ్వానం పంపడుగా'' అన్నాడు తక్కిన నటీనటులు.

''అమంత్రిగారి మాట కాదన లేక ఇచ్చుంటాడులెండి'' అంది తాను.

''అలా అయితే ఏదో ఓ రోల్ ఇచ్చి ఉండేవాడాయన. హీరోయిన్ గానే ఎందుకు పిలుస్తాడు? మీరేం పాపులర్ హీరోయినేం కాదు కదా స్టేజి ఆర్టిస్ట్ గానే ఉన్నారు కదా... మిమ్మల్ని హీరోయిన్‌గా పిలుస్తున్నాడంటే మీమీద తనకు ఉన్న నమ్మకమేనండీ... సందేహించకుండా బయల్దేరండి''.

వారి మాటలు సబబుగానే అనిపించాయి. అందుకే బయల్దేరిందామె.

హైదరాబాద్ లోదిగిన దగ్గర్నుంచీ ట్రీట్‌మెంట్ అదీ బావుంది. సెట్ మీద కలిశాడు రఘురావ్.

''ఇది వాలికి సంబంధించినకథ. వాలి భార్య తార పాత్ర వెయ్యాలి మీరు డైలాగులు తక్కువే ఉంటాయి అయినా మీకు తప్ప ఇంకే లేడీ ఆర్టిస్ట్‌కీ ఇంపార్టెన్స్ లేదు. మరో వన్ అవర్ లో మీరురెడీ అయిపోతే షాట్‌కి పిలుస్తాను'' అన్నాడు.

తలూపింది నీలవేణి అలాగే అన్నట్టుగా.

వెళ్ళిపోయాడతను.

''మొత్తానికిన్నాళ్ళకి తన ప్రతిభ గుర్తించాడన్నమాట రఘురావ్!? ఇంకా తనంటే భయంగా ఫీలవుతున్నట్టున్నాడు— అందుకే డైలాగులు తక్కువే ఉంటాయి అన్నాడు— పోన్లే ఆ మాత్రం భయం ఉండటం మంచిదే. సెట్ మీద అందరూ తనని ఇంకా గౌరవంగా చూస్తారు'' అనుకుందామె గర్వంగా అద్దంలో చూస్తూ

అనుకోకుండా షూటింగు మొత్తం ఇరవై రోజుల్లోనే పూర్తయిపోయింది. ఒక పౌరాణిక చిత్రం అంత తక్కువ వ్యవధిలో తీయగలగడం ఓ రికార్డు అంటూ తెగ రాశాయి పత్రికలు.

షూటింగు ముగిసిన సందర్భంగా ఓ పార్టీ అరేంజ్ వేశాడు రఘురావ్. యూనిట్‌లోని సభ్యులతో పాటు ప్రెస్ వారు కూడా అటెండ్ అయ్యారు.

''పరిచయాలు అవీ అయ్యాక మీరు అటువైపు వెళ్ళి డిన్నర్ తీసుకోండి. ఇటువైపు డ్రింక్స్ అవీ ఉంటాయి'' అన్నాడు రఘురావ్.

అలాగే అంది గానీ మనసు మాత్రం ఇటువైపే లాగుతోందామెకు. తనగురించి ప్రెస్ వాళ్ళు ఏమంటారో వినాలనుంది. డిన్నర్ తాపీగా తీసుకుంటున్నట్టు నటిస్తూ చెవి మాత్రం ఇటువైపు పడేసి ఉంచిందామె.

''మీ కొత్త హీరోయిన్ గురించి చెప్పారు కాదూ'' అని అడిగాడో పాత్రికేయుడు ఓ పది నిముషాల తర్వాత.

''ఏవుందీ... ఆ పాత్రకి ఆవిడే కరెక్ట్ ఫిట్'' అన్నాడు రఘురావ్.

గుండెలు గర్వంతో ఉప్పొంగాయి నీలవేణికి. ''ఎవరైనా వింటే బావుణ్ణు'' అనిఫీలయిందామె. నిజంగానే వాలామంది వింటూనే ఉన్నారు ఆ సంభాషణని.

''రఘురావ్ గారూ సుమారు నెలరోజుల క్రితం ఓ ప్రెస్ మీట్‌లో మీరన్నది గుర్తుందా?''

''ఏంటదీ?''

''పురాణాన్ని తియ్యడంలో మన వాళ్ళు కొన్ని డిటైల్స్ మిస్ అవుతున్నారు. ఉదాహరణకి రామాయణం తీసేరనుకోండి అందులో కిష్కింద లో ఉన్న వానర సైన్యాన్ని చూపించేటప్పుడు మగవాళ్ళకి మాత్రమే మాస్కులు, తోకలు పెట్టి కోతుల్లా చూపిస్తున్నారు. ఆడవాళ్ళని మాత్రం మామూలుగానే చూపిస్తున్నారు. అటువంటివి నా సినిమాల్లో దొర్లకుండా చూసుకుంటాను అని అన్నారు కదా.''

''అవునా''

''మరి ఈ సినిమాలో మీ హీరోయిన్‌కి కోతి మేకప్ వేశారా?''

''లేదండీ'' అంటూ రఘురావ్ మౌనం వహించాడు.

''నువ్వు మరీను బాస్... రఘురావ్ గారు అంత తెలివి తక్కువవారేం కాదు. పైగా విలిపి కూడా... మనకు హీరోయిన్‌లు లేరనా ఆకొత్త హీరోయిన్‌ని తెచ్చింది!?'' అన్నాడు ఓ పాత్రికేయుడు సోడా ఒంపుకొంటూ.

''అంటే?''

''అంటే... అంటే ఇంకేముంది... ఆవిణ్ణే చూశావుగా... నిజానికి ఆవిడకి కోతి మేకప్ చెయ్యాలా... చెప్పు?''

దిమ్మ తిరిగి పోయింది నీలవేణికి.


''అందుకేనా అన్నారు రఘురావ్ గారు కరెక్ట్ ఫిట్ అని'' అంటూ కిసుక్కున నవ్వాడింకో పాత్రికేయుడు.

''మొత్తానికి మంచి అయిటమ్ ఇచ్చారు థాంక్యూ''.

నీలవేణికి స్పృహ వచ్చేసరికి తన ఊరికి వేరే ట్రెయిన్‌లో తాను ఉన్నానన్న సంగతి తనతో ఉన్న ఎస్కార్ట్ ద్వారా తెలుసుకుంది.

అదే రైల్లో క్రితంరోజు రాత్రి రఘురావ్‌తో ఇంటర్వ్యూ విశేషాలు కవరేజ్ వేసిన న్యూస్ పేపర్లు అన్ని ప్రాంతాలకూ చేరడానికి పయనిస్తున్నాయి.

# హిట్ కాంబినేషన్‌లో మరో చిత్రం



మే నెలలో నాగార్జున హీరోగా కామాక్షి ఫిలింస్ నిర్మిస్తున్న కొత్త చిత్రంలో నగ్మా, మీనా నాయికలుగా నటిస్తున్నారు. ఇది హిట్ కాంబినేషన్ నాగార్జుననగ్మా నటించిన కిల్లర్, నాగార్జున మీనా నటించిన ప్రెసిడెంట్ గారి పెళ్ళాం సూపర్ హిట్ చిత్రాలు. అలాగే ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న ఎ.కోదండరామిరెడ్డి, నాగార్జున కాంబినేషన్‌లో వచ్చిన విక్కీదాదా, కిరాయిదాదా, ప్రెసిడెంట్ గారి పెళ్ళాం చిత్రాలు కూడా విజయవంతమైన చిత్రాలేఇలా అన్ని హిట్ కాంబినేషన్‌తో వస్తున్న ఈ చిత్రం ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో. నాగార్జున చిత్రమంటేనే ఒక ప్రత్యేకతగల చిత్రంగా పరిశ్రమలో, అభిమానుల్లో అంచనా ఉంటుంది.

—నారాయణరాజు